క్లుప్తంగా

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార' వేదిక

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

గ్రహణంతో మూతపడిన ఆలయాలు



మూతపడిన పోట్లమర్రి ఆంజనేయస్వామి ఆలయం

బత్తలపల్లి: చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రాలు సంఘమేశ్వర క్షేత్రం, కాటి కోటేశ్వర క్షేత్రం, డి.చెర్లోపల్లిలోని సిద్ధేశ్వరాలయం, దంపెట్ల మదురాపురి చెన్నకేశవాలయం, పోట్లమర్రి ఆంజనేయస్వామి తదితర ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి చేయనున్నట్లు అర్చకులు తెలిపారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు తీర్చాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

ధర్మవరం: తమ సమస్యలను తీర్చాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను విద్యుత్ మీటర్ రీడర్లు కోరారు. ఈమేరకు ఆదివారం పట్టణానికి విచ్చేసిన మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థను నమ్ముకుని 20 ఏళ్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రీచార్జ్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, నాన్ టెక్నికల్ వాళ్లకు వాచ్ అండ్ వార్డ్, సబార్డినేట్లుగా నియమించాలని కోరారు. మీటర్ రీడర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా కోశాధికారి దస్తగిరి, కొండయ్య, రోషన్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ: సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తీవ్రగాయాలు



గాయపడిన యోగానంద

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆదివారం రెండు కార్లు ఢీ కొన్న ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం.. ధర్మవరం పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యోగానంద ధర్మవరం నుంచి అనంతపురానికి తన కారులో బయలుదేరాడు. లింగారెడ్డిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా అనంతపురం నుంచి కదిరి వెళ్తున్న గోపాల్‌కృష్ణ కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. యోగానందకు తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ సోమశేఖర్ మూర్తి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని 108 వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా సత్యసాయి గ్రామోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న సత్యసాయి భక్తులు

చెన్నేకొత్తపల్లి: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పలువురు సత్యసాయి బాబా భక్తులు ఆదివారం చెన్నేకొత్తపల్లిలో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఊరేగించారు. సాయిబాబా పాదుకలు, స్వామి వారి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన సత్యసాయి బాబా భక్తులు చెన్నేకొత్తపల్లిలో భజనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా సాయి ట్రస్ట్ అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, మండల ఇన్‌చార్జ్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా..?



బత్తినిగారిపల్లిలోని ఓ వీధిలో అపరిశుభ్రత

ఎన్పీకుంట: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలుగ్రామాలలో అపరిశుభ్రత తాండవిస్తోంది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్, కల్లంగడిమిట్ట, పెడబల్లి రోడ్డు, బత్తినిగారిపల్లిలోని ఓ వీధిలో వర్షపు నీటితో పాటు, మురుగునీరు చేరి మురుగు గుంటలుగా తయారయ్యాయి. నడవడానికి కూడా వీలుకాని విధంగా ఉండి దోమలు ప్రబలి ప్రజలు మలేరియా, డెంగీ వంటి విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని ఆ వీధి ప్రజలు వాపోతున్నారు. మండలంలో ఇలాంటి దుస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎన్పీకుంట కల్లంగడిమిట్ట వీధిలో నిలిచిన మురుగునీరు

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బుక్కపట్నం మండలం అగ్రహారంలో ఇటీవల మృతి చెందిన బోయ కిష్టప్ప(55), బొమ్మక నారాయణస్వామి(50), చిన్న రమణ భార్య నాగలక్ష్మమ్మ(60)) కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కాశెట్టి రమణ భార్య రామలక్ష్మమ్మను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల కొత్తచెరువు మండలం మైలసముద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుచ్చయ్యగారిపల్లి వాసులు మల్లె లక్ష్మీదేవి(50),లక్ష్మీనరసమ్మ(60) కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఇదే ప్రమాదంలో గాయపడిన కూలీలు గంగులమ్మ, వెంకటలక్ష్మమ్మ, ఇటీవల పాముకాటుకు గురైన కేశవరెడ్డి, అనారోగ్యంతో బాధపడుతున్న ఈడిగి కాంతమ్మను శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన ఎస్ఐ నారాయణరెడ్డి భార్య మంజుల(50)ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను శ్రీధర్‌రెడ్డి సంతాపం తెలియజేశారు.

సుబ్రహ్మణ్యం మృతిపై అనుమానాలు..

గూనిపల్లి చెందిన వడ్డె సుబ్రమణ్యం(34) ఇటీవల రాశింపల్లి సమీపంలోని గుట్టలో రాతి బండపై నుంచి జారిపడి మృతి చెందిన ఘటనపై అనుమానాలున్నాయని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్రమణ్యం దర్యాప్తు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్



గూనిపల్లిలో వడ్డె సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కొత్తకోట కేశప్ప, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి, సర్పంచ్‌లు నాగలక్ష్మి(బరిగమ్మ)భాస్కర్‌రెడ్డి, రమణయ్య, గోవిందరెడ్డి, బుచ్చయ్యగారిపల్లి రవి, వైస్ ఎంపీపీ ఆదినారాయణ, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు, విజయారెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు నాగమల్లిరెడ్డి, వెంకటరెడ్డి, మండల కార్యదర్శి హనుమంతరెడ్డి, మండల యూత్ విభాగం అధ్యక్షుడు ధర్మతేజరెడ్డి, మనోహర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి రఘు, మండల కార్యదర్శి మండల ప్రధాన కార్యదర్శి నాగభూషణ, శివయ్య, లింగమయ్య, మల్లేశ్, పార్టీ మండల ఉపాధ్యక్షులు రంగారెడ్డి, మల్లేశ్, కేపీ.నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, హరినాథ్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్ఐసీ చంద్ర, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్, పాముదుర్తి గ్రామ అధ్యక్షురాలు సుజాత, ఐటీ వింగ్ మండల కన్వీనర్ మాల్యవంతం మారుతి, బుచ్చయ్యగారిపల్లి వైస్ సర్పంచ్ కృష్ణారెడ్డి, చెన్నుడు, మాజీ ఎంపీటీసీ చెన్నారెడ్డి, అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రంగస్వామినాయుడు మృతదేహంపై పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మృతునికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట నివాళి

నల్లమాడ: ఈనెల 5న రంగారెడ్డి జిల్లా కర్తాల్ బస్టాప్ వద్ద కారు ఢీకొట్టిన ప్రమాదంలో మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన జీ. రంగస్వామినాయుడు (50) మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని రంగస్వామినాయుడు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇదే ప్రమాదంలో మృతుని భార్య ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడి భర్త మృతదేహం పక్కనే స్ట్రెచర్‌పై అచేతన స్థితిలో ఉండటం చూసి శ్రీధర్‌రెడ్డి చలించిపోయారు. ఆమె చికిత్స కోసం వైద్యులతో మాట్లాడి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, మాజీ మండల కన్వీనర్ పొరకల రామాంజనేయులు, స్థానిక నాయకులు పెద్ద గంగిరెడ్డి, రామక్రిష్టారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, చంద్రహాసరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, కేశవరెడ్డి తదితరులున్నారు.

ధ్యానం.. సర్వరోగ నివారిణి

బత్తలపల్లి: ధ్యానం సర్వరోగ నివారిణి అని ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి ఆరోగ్యంగా ఉండాలని ధ్యాన మాస్టర్లు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీహరిహర పిరమిడ్ ధ్యాన మందిరంలో ధ్యాన మాస్టర్ మండల నాగేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం-ఆనందం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ ధ్యాన గురువు సామవేదం బాలసుబ్రహ్మణ్యం(విశాఖపట్నం), అహ్మద్ ధ్యానంతో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అంతకు ముందు బ్రహ్మంగారి తత్వాలు, నరసింహ శతకం తత్వాలు, విస్తీకరణ గంటసల పాటలతో అహ్మద్ అందరినీ అలరించారు. అనంతరం ధ్యానులకు ముల్లగూరు అయ్యప్పనాయుడు, సరోజమ్మ దంపతులు అన్నదానం నిర్వహించారు. ధ్యాన మాస్టర్లు మండల నాగేంద్ర, మదనాపు కొండన్న, నెట్టెం నాయుడు, అశ్వర్థమ్మ, ముల్లగూరు సరోజ, బి.యశోధ, బి.గోపాల్, మగ్గం నరసింహులు, లక్ష్మీదేవి, గంటాపురం రామాంజనేయులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు 90 మందికి కంటి పరీక్షలు చేయగా 48 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ పీఆర్‌ఓ రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ ఖలీల్ రెహమాన్, సభ్యులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

- ఈనెల 9న'అన్నదాత పోరు'ను జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్

కదిరి టౌన్: రైతాంగానికి యూరియా అందించడంలో ప్రభుత్వ విఫలమైందని, యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్న పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ విమర్శించారు. రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించారన్నారు.కూటమి ప్రభుత్వం యూరియా సకాలంలో అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏటా రైతులకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ఈ ఏడాది కేవలం రూ.5 వేలు జమ చేశారన్నారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతేడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగానికి ఇప్పటికి ఒక రూపాయి కూడా ఆర్థికసాయం అందంచలేదన్నారు. ప్రస్తుతం ఎరువులు బ్లాక్ మార్కెట్ తరలిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. అన్నదాత పోరు కార్యక్రమానికి నియోజకవర్గంలోని రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మక్బూల్ అహ్మద్, నేతలు

మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం..

గత ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేస్తోందని విమర్శించారు. తద్వారా పేదలకు వైద్యం అందకుండా చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.ప్రణీత్‌రెడ్డి, అధికార ప్రతినిధి వేమల ఫయాజ్, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్,మండల కన్వీనర్లు మణికంఠనాయక్, రవికుమార్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, రంగారెడ్డి, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, కొక్కంటి శ్రీనివాసులనాయుడు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం

రామగిరి: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు విమర్శించారు. ఆదివారం మండలంలోని పేరూరులో చంద్రబాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. బాబు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను మర్చిపోయారన్నారు. అమలు చేస్తున్న అరకొర వాటిలోనూ కోతలు విధిస్తూ లబ్ధిదారులను మోసం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అంటే మోసం గ్యారెంటీ అని ప్రజలందరికీ ఇప్పటికే అర్థమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీటీసీ చిన్నముత్యాలు, నాయకులు కేసీ మల్లికార్జున, వెంకటరెడ్డి, గుడుసాల ఈశ్వరయ్య, పల్లి నారాయణ, వెంకటేశులుతో పాటు పంచాయతీలోని కొత్తపల్లి, దుబ్బార్లపల్లి, ఏడుగురాకులపల్లి గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చంద్రబాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నాయకులకు సూచించారు. ఇటీవల పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న ఆదివారం నల్లమాడ మండలం నల్లసింగయ్యగారిపల్లిలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ను మాతంగి తిప్పన్న, నాయకులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మీపై నమ్మకం ఉంచి పార్టీ ఉన్నతమైన పదవులు కట్టబెట్టిందని నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీల, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రవినాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఫొటో సాయి, నాయకులు రామయ్య, కిష్టప్ప, రాఘవ, కేశప్ప ,రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని సన్మానించిన తిప్పన్న, నాయకులు

కళాకారులకు ఘన సన్మానం

బత్తలపల్లి: స్థానిక శ్రీహరి హర పిరమిడ్ ధ్యాన మందిరంలో బళ్లారి రాఘవ పురస్కారం అందుకున్న అంజినప్పను ఆదివారం బత్తలపల్లి మారుతి నాట్యమండలి వారు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ కళాకారులను సన్మానించడం కళలను పోత్సహించడమేనన్నారు. బళ్లారి రాఘవ జాతీయ అవార్డు గ్రహీత అంజినప్ప, గౌరవాధ్యక్షుడు సామవేదం బాలసుబ్రహ్మణ్యం(విశాఖపట్నం), ట్రస్ట్ డైరెక్టర్ పెద్దరికం సాయి, కార్యదర్శి బొగ్గు రవిని తోటి కళాకారులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. అలాగే లేపాక్షి పద్యనాటక పోటీల్లో పాల్గొన్న ధర్మవరం కళాకారులు అంకె నాగరాజు, జింకల గంగాధర్, ధ్యానగురువులు మండల నాగేంద్ర, మదనాపు కొండన్న, నెట్టెం నాయుడు, ఉమా, వేదపండితులు మంజునాథశర్మను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కల్చరల్ వింగ్ అధ్యక్షులు షరాబ్ యోగానంద ఆచారీ, కళాకారులు ముసలప్ప, గంగాధర, చైతన్యరెడ్డి, సాకే కిరణ్, మిడతల నాగరాజు, ధ్యాన గురువు అహ్మద్ బాషా, పలువురు ధ్యానులు పాల్గొన్నారు.



అంజినప్ప, బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న కళాకారులు, ధ్యాన గురువులు

ఆక్రమణ భూమిలో పనుల అడ్డగింత

రొద్దం: రొద్దకాంపల్లిలో పెనుకొండకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించిన చెరువు కట్ట చదును పనులను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. రొద్దకంపల్లి పరిధి గ్రామ చెరువు కట్ట పరిధిలో సర్వే నంబరు 97 పైకి గతంలో పెనుకొండకు చెందిన ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. చెరువు కట్టను సైతం చెరిపివేసేందుకు ఆదివారం జేసీబీ యంత్రంతో పనులు చేయిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంటనే తహసీల్దారు ఉదయశంకరరాజుకు సమాచారం అందించారు. ఈక్రమంలో సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించారు. అనంతరం పనులు నిలిపివేయించారు. ఈఘటనపై తహసీల్దారు ఉదయశంకరరాజు 'సాక్షి'కి వివరణ ఇచ్చారు. గతంలో చెరువు కట్టకు చెందిన సదరు సర్వే నంబరు 97 భూమిని పెనుకొండకు చెందిన రామలింగప్ప అనే వ్యక్తిపై రిజిస్ట్రేషన్ జరిగిందని, దీనిపై ఫిర్యాదులను ఉన్నతాధికారులకు గ్రామస్తులు నివేదించారన్నారు. దీంతో సదరు రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారన్నారు. రిజిస్ట్రేషన్‌కు రద్దుకు చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించామని, అయినప్పటికీ రామలింగప్ప అనే వ్యక్తి చెరువు కట్టపై చేపడుతున్న పనులను రెవెన్యూ శాఖ సిబ్బంది నిలిపివేశారని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయ క్రికెట్ టోర్నీ విజేత ఎన్పీకుంట జట్టు



ట్రోఫీతో ఎన్పీకుంట టీచర్ల జట్టు

ఎన్పీకుంట: కదిరి ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీ విజేతగా ఎన్.పీ.కుంట ఉపాధ్యాయుల జట్టు నిలిచింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గత 21 రోజులుగా నిర్వహిస్తున్న టోర్నీలో 13 మండలాల నుంచి 13 జట్లు పాల్గొన్నాయని మెంటార్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ధర్మవరం, ఎన్.పీ.కుంట జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 68 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఎన్పీకుంట జట్టు 11 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజేతగా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా సందీప్ ఎంపికయ్యారు. విజేతగా నిలిచిన జట్టును ఎంఈఓ గోపాల్‌నాయక్, ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి గౌస్‌లాజం, అంజినాయక్ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు శ్రీనివాసులు, రమణ, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత పోరు'కు తరలిరండి

ఎన్పీకుంట: రైతుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించే 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గోవిందునాయక్ ఓ ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో భాగంగా కదిరిలో ర్యాలీ నిర్వహించి, ఆర్డీఓ కు వినతిపత్రం అందిస్తామన్నారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిదులు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

'దళితులు చస్తే పూడ్చుకునేందుకు పోరాటాలు చేయాలా?'

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో దళితులు వివక్షకు గురవుతున్నారని ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని బసంపల్లి గ్రామానికి చెందిన దళితుడు(మాల) నారాయణ అనే వృద్ధుడు మృతి చెందాడని, అదే గ్రామానికి చెందిన కొందరు శవాన్ని పూడ్చనీయకుండా అడ్డుకోవడం హేయమన్నారు. గ్రామంలో దళిత వర్గాలకు చెందిన వారు మరణిస్తే శవాన్ని పూడ్చడానికి కూడా పోరాడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోని దళితులకు శ్మశాన స్థలాన్ని చూపాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మాహాలయ పౌర్ణమి వేడుకలు



బత్తలపల్లి వేరుశనగ పొలంలో పూజలు చేస్తున్న ఓ కుటుంబం

బత్తలపల్లి: మండలవ్యాప్తంగా ఆదివారం మహాలయ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే పొలాల వద్ద జంతు బలులను నిర్వహించారు. పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధి కురిసి కలిసి రావాలని కోరుకున్నారు. ఇదిలా ఉండగా చంద్రగ్రహణం కారణంగా చాలామంది రాత్రి ఉపవాసం ఉన్నారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మహాలయ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనగానపల్లి, ముక్తాపురం, తగరకుంట గ్రామాల్లో ప్రజలు గ్రామాలు సల్లాపురమ్మ, గంగమ్మ, మారెమ్మ దేవతలకు బోనాలు ఎత్తుకొని వెళ్లి పూజలు చేశారు. రైతులు తమ పంట పొలాల దగ్గరకు వెళ్లి పంటలు బాగా పండాలని పూజలు చేశారు.



ముక్తాపురంలో బోనాలు మోస్తున్న మహిళలు

కాంచీపురం సాయి భక్తుల పర్తియాత్ర



సంగీత విభావరి నిర్వహిస్తున్న కాంచీపురం సత్యసాయి భక్తులు



భజన మండలి, సత్యసాయి సేవా సమితులను ప్రారంభిస్తున్న ఆర్‌జె.రత్నాకర్ రాజు



సత్సంగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

ప్రశాంతి నిలయం: కాంచీపురం ఉత్తర జిల్లా సత్యసాయి భక్తులు పర్తియాత్ర పేరుతో పుట్టపర్తికి విచ్చేశారు. ఆదివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సంగీత విభావరి నిర్వహించారు. కాంచీపురం జిల్లాలో నూతనంగా రెండు నూతన సత్యసాయి సమితిలు, ఒక భజన మండలిని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రారంభించారు. తర్వాత సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. సాయంత్రం సత్యసాయి యూత్, భక్తులు సంగీత విభావరి నిర్వహించారు. సంగీత విభావరితో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ప్రశాంతి నిలయంలోని సత్సంగ్ భవన్‌లో కాంచీపురంలో జరుగుతున్న సత్యసాయి సేవా కార్యక్రమాలపై ఎగ్జిబిషన్ నిర్వహించారు.